శింగనమల.. ఇక సస్యశ్యామలం

- నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్చెల్సీ ద్వారా 1.35 టీఎంసీల నీటి కేటాయింపు
- ఇప్పటికే శింగనమల చెరువు లోకలైజేషన్
- నీటి కేటాయింపునకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు శింగనమల ప్రజల కృతజ్ఞతలు


నియోజకవర్గంలోని చెరువులకు నీటిని కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి(ఫైల్)


శింగనమల మండలంలోని సలకంచెరువు

శింగనమల: నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి ఫలించింది. యల్లనూరు నుంచి గార్లదిన్నె వరకు చేపట్టిన పాదయాత్రలో రైతులు, ప్రజలు నీటికోసం పడుతున్న ఇబ్బందులను ఆమె కళ్లారా చూసి చలించిపోయారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో దాదాపు 50 మైనర్ ఇరిగేషన్ చెరువులు, కుంటలకు హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్చెల్సీ ద్వారా నీటిని కేటాయించాలని 2021 జూన్ 24న మరోమారు ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన సీఎం సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా అప్పట్లో అధికారులను ఆదేశించారు.

1.35 టీఎంసీల నీరు కేటాయింపు

నియోజకవర్గంలోని 45 మైనర్ ఇరిగేషన్ చెరువులు, కుంటలను నింపేందుకు హెచ్ఎన్ఎస్ఎస్ – హెచ్చెల్సీ ద్వారా 1.35 టీఎంసీలు నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్ 249ను మంగళవారం జారీ చేసింది. దీని ద్వారా శింగనమల నియోజకవర్గంలోని చెరువులకు నీటిని కేటాయించనున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా వచ్చే నీటిని పీఏబీఆర్‌కు, అక్కడ నుంచి మిడ్ పెన్నార్ డ్యాంకు, అటు నుంచి హెచ్చెల్సీ ద్వారా చెరువులకు విడుదల చేయనున్నారు.

ఈ చెరువులకే నీటి కేటాయింపు

- శింగనమల మండలంలో సలకంచెరువు, అప్పరాయునికుంట, దేవలచెరువు, ఈస్ట్ నరసాపురం కుంట
- గార్లదిన్నె మండలంలో జంబులదిన్నె, ఆకులవంకకుంట, దత్తారాయకుంట, రాగలమాకుంట, ఓటికుంట, బ్రాహ్మణపల్లి, కోటంక చెరువు
- బుక్కరాయసముద్రం మండలంలో ఎగువచెరువు, నారాయణప్పకుంట, కొర్రపాడుకుంట, చిన్నిక్రిష్టమ్మ కుంట, తూర్పుచెరువు, కేకే ఆగ్రహారం, దండువారిపల్లి, అనంతసాగర్, సిద్దరాంపురం చెరువు
- నార్పల మండలంలో శిద్దరాచెర్ల, మాలవాండ్లపల్లి, హెచ్.సోదనపల్లి, తుంపెర బ్లాక్ ట్యాంక్, గూగూడు, రంగాపురం, కూరగానిపల్లి, నడిమిపల్లి, చిన్నచెరువు
- పుట్లూరు మండలంలో పెద్దకుంట, ఇందిరమ్మ చెరువు, పాలోటి చెరువు, మల్లేపల్లికుంట, ఊరుకుంట, గాలింగరకుంట, కొండగారికుంట, రంగరాజుకుంట
- యల్లనూరు మండలంలో మోడల్‌కుంట, తిరుమలాపురం చెరువు, బొప్పేపల్లి, కొత్తకుంట, గంగమ్మ చెరువు

నెరవేరిన లోకలైజేషన్ హామీ

జిల్లాలోని అతిపెద్ద చెరువైన శింగనమల రంగరాయులచెరువు లోకలైజేషన్ హామీ నెరవేరింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డిలు ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి చెరువు లోకలైజేషన్ చేయించారు. ఈ మేరకు చెరువుకు ఒక టీఎంసీ నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. నియోజకవర్గంలో చివరి మండలాలైన పుట్లూరు, యల్లనూరుకు హెచ్చెల్సీ నీరు అందే అవకాశం లేదు.దీంతో ఈరెండు మండలాల్లో సాగు, తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను సైతం సీఎం దృష్టికి తీసుకెళ్లి గండికోట రిజర్వాయర్ నుంచి 0.50 టీఎంసీల నీటిని పుట్లూరు మండలంలోని సుబ్బరాయసాగర్, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువుల కోసం కేటాయింపులు చేయించారు. అక్కడి నుంచి నీటిని తీసుకురావడానికి డీపీఆర్ అనుమతులు తీసుకొచ్చారు. ఇందుకోసం రూ.250 కోట్లు మంజూరు చేస్తామని నార్పల సభలో సీఎం జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే హెచ్చెల్సీ ద్వారా వచ్చే నీటితో పాటు అదనంగా నియోజకవర్గానికి 2.85 టీఎంసీల నీటిని తీసుకురావడానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి చేశారు. ఈ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు నీటి కేటాయింపులు చేసిన సీఎం జగన్‌కు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తాగు, సాగునీటి కష్టాలకు చెక్



భవిష్యత్‌లో శింగనమల నియోజకవర్గానికి సాగు, తాగునీటి కష్టాలు రాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి కృషి చేశారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలుగా గెలిచినా వారి స్వలాభాలు చూసుకున్నారు తప్ప ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీర్చలేదు.

– ఎన్‌వీ నారాయణ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

చరిత్రాత్మకం



ఏక కాలంలో పదుల సంఖ్యలో చెరువులకు సాగునీరు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. రైతు బాంధవునిగా సీఎం జగన్‌ను మా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. రైతులకు ఇది ఒక పెద్ద పండుగ.

–వెంకటరెడ్డి, చెన్నంపల్లి

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం. నియోజకరవ్గంలోని ఏసమస్యలు తీసుకెళ్లిన పరిష్కరిస్తున్నారు. నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యను తీర్చాలని కోరిన వెంటనే నీటిని కేటాయించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.520 కోట్లు కేటాయించారని, పులివెందులకు అనుకుని ఉన్న శింగనమల నియోజకవర్గాన్ని జగనన్న తన నియోజకవర్గంగా చూస్తున్నారన్నారు.

–ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

జగనన్నలా చంద్రబాబు ఎప్పుడైనా ఆలోచించారా?

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


గుత్తి రూరల్: బేతాపల్లిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలను తెలుసుకునేందు కోసమే సీఎం జగన్ జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఏ రోజైనా ఆ విధంగా ఆలోచించారా అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి విమర్శించారు. బుధవారం బేతాపల్లిలో సర్పంచ్ చిన్న ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నేత వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చే హామీలు కాగితాలకే పరిమితం అవుతాయన్నారు. కాకిలెక్కల మాదిరిగా ఓ పేపర్‌లో రాసుకొచ్చి అంత చేశాం, ఇంత చేశాం అంటూ గాలి మాటలను ప్రజల ముందు చదివేసి వెళ్లిపోతారని, ఆ కాకిలెక్కలను ఎల్లో మీడియా గోరంతని కొండంత చేసి ఇక చంద్రబాబు లేకపోతే రాష్ట్రమే లేదు అన్నట్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. జగనన్న పరిపాలనలో ఇచ్చిన హామీలతో పాటుగా కొన్ని చెప్పనివి కూడా అర్హులైన వారికి అందాయన్నారు. చంద్రబాబుకు ఎప్పుడూ అధికార యావే తప్ప ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఉండదన్నారు. అదే జగనన్న నాలుగేళ్లు అనునిత్యం ప్రజలకు ఏం చేయాలి అనే తపనతోనే పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నను 2024 మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధ పడుతూ మంచానికే పరిమితమైన సుధాకర్ అనే వ్యక్తిని ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతి రెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, నాయకులు బొలికొండ, గంగరాజు, చంద్రప్ప, పుల్లప్ప, గోవిందు గౌడ్, ఓబుళరాజు, గట్టప్ప, పెద్దలాలెప్ప, మల్లేష్, జగన్, నారాయణ, శివ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కోనా మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గురుప్రసాద్ యాదవ్, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, బేడల వెంకట్రాముడు, డాక్టర్.నాగేంద్ర, ప్రవీణ్, మల్లయ్య, కౌన్సిలర్లు ఫరూక్, శివరాం, వరదరాజులు, రమణ, నరేష్, సర్పంచ్‌లు గురు మస్తాన్, చిదంబరి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడతా

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఎంఈ ఈశ్వరయ్య, ఏసీపీ ఇసాక్, ఏఈ రవిచంద్ర, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డిని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే, కౌన్సిల్ సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.


ఎమ్మెల్యే వైవీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున బుధవారం ఉదయం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

104 వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

యాడికి: గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుజాత కోరారు. పెద్దపేటలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా అధికారిణి సుజాత ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా 104 వద్దకు వచ్చిన రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందించారు. తిరునాంపల్లెలో నాలుగేళ్ల క్రితం పక్షవాతం, చెవుడుతో మంచానికే పరిమితమైన 80 ఏళ్ల వృద్ధురాలు పద్మావతికి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా వైద్యులు అందిస్తున్న సేవ గురించి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుజాత వృద్ధురాలి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు శ్రీనివాసులు రెడ్డి, శ్రీరామ్ కుమార్, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, 104 జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యం లభిస్తుందని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. బుధవారం కల్లూరు–2లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి, డాక్టర్ కృతి, 104 నిర్వహణ అధికారి కృష్ణమూర్తి, ఎమ్ఎల్‌హెచ్‌పీ మధులత, ఏఎన్ఎం నాగేశ్వరి,హెల్త్ అసిస్టెంట్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.


పెద్దపేటలో 104 సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ సుజాత

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

తాడిపత్రి అర్బన్: ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించడం ఎంత వరకు సమంజసమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి మండిపడ్డారు. కృష్ణాపురం ఏడవ రోడ్డులో అండర్ డ్రైనేజీ సమస్య తలెత్తి మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు బయటికి వస్తుండడంతో మూడు రోజుల క్రితం కాలనీ వాసులు రమేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ విషయాన్ని రమేష్‌రెడ్డి వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సొంత నిధులు వెచ్చించి మరమ్మతు చేయిస్తానని, కార్మికులను పంపించాలని రమేష్‌రెడ్డి అధికారులను కోరారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కాలనీమహిళలతో కలిసి బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధరణీబాబు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని నిరసన విరమించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మున్సిపల్ డీఈ వెంకట సుబ్బయ్య అక్కడికి చేరుకున్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని డీఈ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


మున్సిపల్ డీఈని ప్రశ్నిస్తున్న రమేష్‌రెడ్డి

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

తాడిపత్రి టౌన్: స్థానిక హరిజన వాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 0–5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు సౌజన్య, లక్ష్మీ కుళ్లాయిమ్మ తెలిపారు. కౌన్సిలర్లు అంజనమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

పెద్దవడుగూరు : ప్రజలు చిరుధాన్యాలు తినడం వలన ఆరోగ్యంగా ఉంటారని మహిళా రైతుల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం మాస్టర్ ట్రైనర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం లక్ష్మంపల్లి గ్రామంలో పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరటి తోటలతో నాణ్యమైన ఆకు కూరలు, కూరగాయలు పండించుకోవచ్చన్నారు. కొర్రలు, రాగులు, జొన్నలు తదితర ధాన్యాలు తినడంతో కలిగే లాభాలను వివరించారు.

సచివాలయాల తనిఖీ

నార్పల: బండ్లపల్లి, బి.పప్పూరు గ్రామ సచివాలయాలను ఈఓఆర్డీ లక్ష్మినరసింహ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సర్పంచు నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శులు రఘునాథ్ రెడ్డి, సూర్య కళావతి ఉన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి అర్బన్: స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో పుల్లన్న అనే వ్యక్తి మట్కా రాస్తుండగా సెబ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.17,400లతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

కల్యాణమస్తు పేదలకు వరం


నగదు అందిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు పథకం పేదలకు వరంలాంటిదని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి అన్నారు. శింగనమలకు చెందిన రామాంజినమ్మ కుమార్తె వివాహం కావడంతో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద రూ. లక్ష మంజూరైంది. బుధవారం నగదును ఆయన రామాంజినమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, వైఎస్సార్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి నారాయణ, నాయకులు చెన్నకేశవులు, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల మీట్

గుంతకల్లు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బీవీ మాధవి బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో బుధవారం అదుపు తప్పి బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన రాజేష్ పని మీద బైక్‌పై గుంతకల్లుకు బయలు దేరాడు. అయితే గుత్తిలోని గుంతకల్లు రోడ్డులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు రూరల్: గుంతకల్లు ఎంపీడీఓగా వెంకటరమణప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓకు ఎంపీపీ బీవీ మాధవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

పెద్దవడుగూరు : మండల కేంద్రానికి చెందిన రంగనాయకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను బుధవారం ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

శింగనమల: పి.జలాలపురం వద్ద బుధవారం రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈసందర్భంగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని 21 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. సీఎస్‌డీటీ రాజశేఖర్, విజిలెన్స్ ఎస్ఐ జయపాల్‌రెడ్డి, ఏఈఈ రవీంద్రనాథ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణం తనిఖీ


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ

యాడికి: మండల కేంద్రంలోని వెంకట్ ఎరువుల దుకాణాన్ని బుధవారం గుత్తి ఏడీ వెంకటరాముడు ఏఓ మహబూబ్‌బాషాతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని, షాపుల ముంగిట నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు వేములపాడులోని రైతు భరోసా కేంద్రంలో విత్తన పంపిణీని పరిశీలించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకేల సిబ్బంది సమీక్ష నిర్వహించారు.

మట్కాబీటర్ల బైండోవర్


సూచనలిస్తున్న ఏఎస్ఐ సంపత్‌కుమార్

యల్లనూరు: మండలంలో మట్కా బీటర్లు రాసినా, ఆడినట్లు రుజువైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ సంపత్ డిప్యూటీ తహసీల్దార్ శ్వేతారెడ్డి సమక్షంలో 15 మంది మట్కాబీటర్లను బైండోవర్ చేశారు. ఇకమీదట మట్కా రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సొంత పూచీకత్తుపై డిప్యూటీ తహసీల్దార్ విడుదల చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జేవీకే కిట్లు సరఫరా


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

యల్లనూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు సరఫరా అయినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 2871 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగు, యునిఫాం, బూట్లు, బెల్టు, టెక్ట్‌బుక్స్, నోటు బుక్స్‌లు, డిక్షనరీలు సరఫరా అయ్యాయన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తామన్నారు.


మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదాం

పామిడి: మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదామని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శాఖాపరమైన అంశాలపై సమీక్షించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జయానాయక్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎండీపీఓ అనుంపల్లి, ఖాదర్‌పేట, దేవరపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులు పరిశీలంచిన సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మహిళకు ఆర్థిక సాయం

తాడిపత్రి అర్బన్: అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో నివాసముంటున్న దిల్షాద్ అనే మహిళ గర్భకోశ వ్యాధితో బాధపడుతుండేది. విషయాన్ని తెలుసుకున్న ఫయాజ్ బాషా ట్రస్టు చైర్మన్ ఫయాజ్‌బాషా బుధవారం తన కార్యాలయంలో మహిళకు రూ.10 వేలు నగదు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, విజయ్, అగ్గిరప్ప తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి


సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

యల్లనూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ భూములను రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆరవేడులో జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి రైతుకు నోటీసులు ఇచ్చిన తర్వాత సర్వే ప్రారంభించాలన్నారు. రైతుల పొలాల్లోకి గ్రామ సచివాలయ సర్వేయర్లు వచ్చి పాయింట్లు తీసుకుంటారన్నారు. రైతులు ఓపికతో రీ సర్వే చేయించుకోవాలన్నారు. క్యూజీఐఎస్‌లోకి మార్పు చేసుకుని త్వరలోనే రైతులకు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, వీఆర్వో రేణుక, మండల సర్వేయర్ షర్వాని పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో వెలిసిన హజరత్ ఖాజా బందే నవాజ్ గేసు దాస్ ఉరుసు బుధవారం ముగిసింది. హజరత్ దర్గా నుంచి కోటలోని సయ్యద్ బాషా దర్గా వరకు గంధాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా జియారత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: తాడిపత్రి మండలం గంగాదేవిపల్లెకు చెందిన భాస్కర్, గంగరాజు బుధవారం పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

స్కేటింగ్ పోటీలో ప్రతిభ

తాడిపత్రి టౌన్: గుంటూరులో ఈనెల 3,4 తేదీల్లో స్టేట్ లెవల్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు వివిధ విభాగాల్లో చాంపియన్స్ సాధించినట్లు స్థానిక స్కేటింగ్ కోచ్ మధు తెలిపారు. పోటీల్లో 18 మంది క్రీడాకారులు బహుమతులు సాధించారన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి : మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రాత్రి రూరల్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 8 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుండి రూ 26,940 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. పుట్లూరు రోడ్డులోని ఏఎస్ఆర్ గార్డెన్ సమీపంలో జూదమాడుతున్న రమేష్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ 10,540లతో పాటు 3 బైకులు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. చుక్కలూరు పారిశ్రామిక వార్డులోని వేణు గ్రానైట్స్ సమీపంలో పేకాట ఆడుతున్న నారాయణతో పాటు మరో నలుగురిని అరెస్టు చేసి రూ.16,400 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్టపై ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన లక్ష్మి అనే వివాహిత బుధవారం సాయంత్రం చెరువు కట్టపై పురుగు మందు సేవించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు.